క్లుప్తంగా

అపరిష్కృత సమస్యలు పరిష్కరించాలి: ఏపీటీఎఫ్



డీటీకి వినతి పత్రం ఇస్తున్న ఉపాధ్యాయులు

బంగారుపాళెం:అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏపీటీఎఫ్ నాయకుడు డిమాండ్ చేశారు. శుక్రవారం ఏపీటీఎఫ్ మండలశాఖ స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేసింది. జిల్లా గౌరవాధ్యక్షుడు గోపీనాథ్ మాట్లాడుతూ, రాష్ట్ర శాఖ పిలుపు మేరకు ఉపాధ్యాయుల సమస్యలపై ఆందోళనకు పూనుకున్నట్టు చెప్పారు. ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న డీఏను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని, 12వ పీఆర్సీ ఏర్పాటు చేసి, సీపీఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సమస్యలపై వినతి పత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ కళ్యాణికి అందజేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు నవీన్‌కుమార్, మురళీకృష్ణ, వాసుదేవయ్య, చిరంజీవి, శ్రీనివాసులు, రామకృష్ణ, సునీత, మొగిలయ్య, ఇబ్రహీం, ఉష, నాసీర్‌బాషా, ధనలక్ష్మి, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ బాధ్యతల స్వీకరణ



చంద్రశేఖర్‌రెడ్డి

ఐరాల: ఎంపీడీఓగా చంద్రశేఖర్ రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. రామచంద్రాపురం మండలంలో ఏఓగా పని చేస్తూ ఉద్యోగోన్నతిపై ఆయన ఇక్కడికొచ్చారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ భువనేశ్వరి నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు.

మహిళల స్థానం అత్యున్నతం



అవగాహన కార్యక్రమంలో ప్రిన్సిపల్, ఎస్‌ఐ, అధ్యాపకులు

చిత్తూరు కలెక్టరేట్ : సమాజంలో మహిళల స్థానం అత్యున్నతమైనదని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జీవనజ్యోతి అన్నారు. శుక్రవారం కళాశాలలో మహిళా సాధికారత విభాగం ×మహిళల హక్కులు–భద్రత×పై అవగాహన కార్యక్రమం నిర్వహించింది. ప్రిన్సిపల్ మాట్లాడుతూ, మహిళలు అటు కుటుంబంలోను, ఇటు సమాజంలోను ప్రధాన పాత్ర పోషిస్తున్నారన్నారు. మహిళలు నిరంతరం పలు సమస్యలను ఎదుర్కోవాల్సిన పరిస్థితి వస్తోందన్నారు. అటువంటి పరిస్థితులను ఎదుర్కొనేందుకు భద్రత, అవగాహన ముఖ్యమన్నారు. మహిళలు తమ హక్కులను తెలుసుకుని వాటి సాధనకు పోరాడాలన్నారు. ఎన్‌ఆర్‌పేట ఎస్‌ఐ నాగసౌజన్య మాట్లాడుతూ, మహిళల హక్కులు, వ్యక్తిగత భద్రత గురించి తెలుసుకోవాలన్నారు. మహిళలు తమ హక్కులను తెలుసుకున్నప్పుడే వేటినైనా ధైర్యంగా ఎదుర్కోగలరన్నా రు. అనంతరం విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో సమన్వయకర్త నవనీత, అధ్యాపకులు జ్యోత్స్న, కవిత, అమృత, వినీల, హరి, భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పుష్పపల్లకి

కాణిపాకం: ప్రత్యేక బ్రహ్మోత్సవాల్లో భాగంగా కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో శనివారం పుష్పపల్లకి సేవను వైభవంగా నిర్వహించనున్నట్టు ఆలయ ఈఓ పెంచల కిషోర్ తెలిపారు. ఉదయం అభిషేకం, రాత్రి పుష్పపల్లకి సేవ ఉంటుందని, దీనికి సంబంధించి ఆలయంలో ముందస్తు ఏర్పాట్లు చేశామన్నారు.

రైతులు బ్యాంకు ఖాతాకు ఆధార్ అనుసంధానం చేయాలి

తవణంపల్లె: రైతులు తమ బ్యాంకు ఖాతాలకు ఆధార్ నంబరు విధిగా అనుసంధానం చేయాలని మండల వ్యవసాయాధికారి జి. ప్రవీణ్ తెలిపారు. మండలంలో 51 మందికి వారి బ్యాంకు ఖాతాలను ఆధార్ నంబరు అనుసంధానం చేయలేదన్నారు. దీనితో రైతులకు అన్నదాత సుఖీభవ డబ్బులు జమ కావన్నారు. రైతులు సమీప రైతు సేవా కేంద్రంలో సిబ్బందిని సంప్రదించి వారి బ్యాంకు ఖాతాలకు ఆధార్ నంబరును అనుసంధానం చేయించుకోవాలని కోరారు.

'చిత్తూరులోని పీసీఆర్ కూడలిలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ ఇది. గతనెలలో ఓ మోస్తరు వర్షం, గాలి రావడంతో భారీ ఫ్లెక్సీ నేలకు ఒరిగింది. పెద్ద కొయ్యలతో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ రోడ్డుపై పడేసమయంలో అదృష్టవశాత్తు అక్కడ పాదచారులు, వాహనాలు వెళ్లలేదు. ఎవరైనా అటువైపు వెళ్లుంటే మాత్రం ప్రాణాలు గాల్లో కలిసిపోయేవి.'



చిత్తూరులోని పీసీఆర్ కూడలి వద్ద గాలి-వానకు నేలకొరిగిన ఫ్లెక్సీ (ఫైల్)

'మూడు రోజుల క్రితం చిత్తూరులోని హై రోడ్డులో టీడీపీ నేతలకు చెందిన ఫ్లెక్సీ ఏర్పాటు చేసే క్రమంలో హోర్డింగు పైకి ఎత్తుతున్న సమయంలో ఇనుప చువ్వ 33 కేవీ విద్యుత్‌లైన్‌ను తాకింది. ఈ ప్రమాదంలో వేలూరుకు చెందిన దినసరి కూలీ ఆనంద్ కరెంటు షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందగా, ఇద్దరు తీవ్ర గాయాలపాలయ్యారు.'



ఫ్లెక్సీ కడుతూ కరెంటు షాక్‌కు గురై మృతి చెందిన ఆనంద్ (ఫైల్)

సంతోషం మాటున విషాదాలు..!

- ప్రాణాలు తీస్తున్న ఫ్లెక్సీ'ల సంస్కృతి
- గాలి–వర్షం వస్తే నేలకొరుగుతున్న వైనం
- ఇటీవల కరెంటు షాక్‌తో ఒకరు మృతి
- చిత్తూరులో 'ఫ్లెక్సీ':. కటౌట్లకు చరమ గీతం పాడేదెన్నడో..?

చిత్తూరు అర్బన్: చిత్తూరులో ఫ్లెక్సీలు, కటౌట్ల ఏర్పాటు అంశం పరిధి మించిపోయింది. రాజకీయ పార్టీలు ఏర్పాటు చేస్తున్న ఫ్లెక్సీలు, భారీ కటౌట్లు ప్రజల ప్రాణాలపైకి వస్తోంది. అందులోనూ కూటమి నేతలు ఇష్టానుసారం ఏర్పాటు చేస్తున్న ఫ్లెక్సీల కారణంగా అటు భద్రత విషయంలో, ఇటు శాంతి భద్రతల విషంలోనూ ఇబ్బందులను తెచ్చిపెడుతోంది. రెండు నెలల క్రితం గిరింపేటలో టీడీపీ నేతలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో ఓ నాయకుడి ఫోటోలేదనే ఆగ్రహంతో దాన్ని చించేశారు. ఈ ఘటనతో ఇరువర్గాలు కొట్టుకుని పోలీస్ స్టేషన్‌కు సైతం వెళ్లాయి. పరస్పరం కేసులు పెట్టుకున్నారు. ఇంత జరుగుతున్నా వీటికి చెక్ పెట్టే దిశగా ఏ ఒక్క ప్రజాప్రతినిధి, జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకోవడం లేదు.

మరొకటి జరగక మునుపే...

రాజకీయ నాయకులు వాళ్లకు పదవులు వచ్చినపుడు, జన్మదినాలు, ముఖ్యనేతల రాక సమయంలో ఆనందంతో ఏర్పాటు చేస్తున్న ఫ్లెక్సీలు ప్రాణాలు తీస్తూ విషాదాన్ని నింపుతున్నాయి. చిత్తూరులో ఫ్లెక్సీలు, కటౌట్ల కారణంగా మరో ప్రాణం పోకమునుపే అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. కార్పొరేషన్ అధికారులు, పోలీసు యంత్రాంగం సంయుక్తంగా కలిసి ఫ్లెక్సీలను నిర్దీత స్థలంలోనే ఏర్పాటు చేసుకునే చూడాలి. వీటిని ఏర్పాటు చేసినపుడు ఏదైనా ప్రమాదం జరిగితే, దాన్ని ఏర్పాటుచేసే వ్యక్తి బాధ్యత వహిస్తారంటూ ప్రమాణ పత్రం తీసుకోవాలి. ప్రమాదం జరిగితే బాధితులకు పరిహారం, వైద్య ఖర్చులు కూడా భరించాలి. రెండేళ్ల క్రితం చిత్తూరు నగరాన్ని పోస్టర్ ఫ్రీగా చేస్తూ కౌన్సిల్ తీర్మానం అమలు చేయాల్సిన అధికారులు కూడా మౌనంగా ఉన్నారు. మరి అధికారులు సానుకూలంగా స్పందిస్తారో..? మరో ప్రాణాన్ని పణంగా పెడుతారో చూడాల్సి ఉంది.

కార్పొరేషనే బాధ్యత

నగరంలో ఫ్లెక్సీలు, కటౌట్లు, బ్యానర్లు, గోడలపై రాతలు రాయాలన్నా మునిసిపల్ కార్పొరేషన్ అధికారుల అనుమతి తప్పనిసరి. ఫ్లెక్సీలు ఏర్పాటు చేసే వ్యక్తులు.. వాటిని ఎన్ని రోజులు ఉంచుతారు..? ఎంత మొత్తం నగదు కార్పొరేషన్‌కు చెల్లించాలి..? ఏదైనా జరగరానిది జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారు..? అనే విషయాలన్నీ కూడా కార్పొరేషన్ అధికారులు చూసుకోవాలి. పొరపాటున ప్రమాదం జరిగితే ఫ్లెక్సీలు ఏర్పాటు చేసే వ్యక్తులతో పాటు, వీటిని డబ్బులు వసూలు చేసిన కార్పొరేషన్ కూడా దోషిగానే నిలబడాల్సి ఉంటుంది. ఫ్లెక్సీలు, కటౌట్లు కూలిన సమయంలో చిన్నపాటి గాయాలైతే మానుతాయి, కోలుకుంటారు. కానీ ప్రాణం పోయిన తరువాత ఎంత పరిహారం ఇచ్చినా, తిరిగి తీసుకురాలేని పరిస్థితి. మరోవైపు నగరంలో వంద ఫ్లెక్సీలు పెడితే, వాటిలో పదింటికి మాత్రమే కార్పొరేషన్ అధికారులు అనుమతులు ఇస్తున్నారు. మిగిలినవి ఇష్టానుసారంగా వెలుస్తున్నాయి.

నోటీస్ బోర్డు

నేడు విద్యుత్ అంతరాయం

- చిత్తూరు కార్పొరేషన్: విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు చిత్తూరు నగరం, రూరల్స్, గుడిపాల, యాదమరి, ఐరాల, తవణంపల్లె, బంగారుపాళ్యం, పూతలపట్టు మండలాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ మునిచంద్ర తెలిపారు.

19న హుండీ ఆదాయం లెక్కింపు

- కాణిపాకం: ఈనెల 19న ఉదయం 7 గంటలకు ఆస్థాన మండపంలో శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థాన ఆలయ హుండీ ఆదాయం లెక్కించనున్నట్లు ఆలయ ఈఓ పెంచల కిషోర్ తెలిపారు. ఆలయ అధికారులు, సిబ్బంది విధిగా హాజరు కావాలని ఆయన కోరారు.

15 వరకు 'సప్తగిరి' బ్యాంకింగ్ సేవలు ఉండవు

గంగవరం: రాష్ట్రంలో నాలుగు గ్రామీణ బ్యాంకులు ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకుగా ఏర్పడిన సందర్భంగా ఈ నెల 15వ తేదీ వరకు సప్తగిరి గ్రామీణ బ్యాంక్ గంగవరం బ్రాంచ్‌లో ఎలాంటి సేవలు జరగవని బ్యాంక్ మేనేజర్ కృపానంద్ తెలిపారు. భారత ప్రభుత్వ ఆదేశాల ప్రకారం రాష్ట్రంలోని సప్తగిరి గ్రామీణ బ్యాంక్, ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్, గ్రామీణ వికాశ్ బ్యాంక్, చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ ఈ నాలుగు గ్రామీణ బ్యాంకులు ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్‌గా ఏర్పడినట్లు పేర్కొన్నారు. బ్యాంకుల విలీనం సందర్భంగా కోర్ బ్యాంకింగ్ సొల్యూషన్స్ అనుసంధానంలో జరిగే సాంకేతిక ప్రకియ కారణంగా 15వ తేదీ ఉదయం 10 గంటల వరకు ఆర్థికపరమైన బ్యాంకింగ్ సేవలు, అన్ని ఆన్‌లైన్ లావాదేవీలు జరగవని, దీనికి ఖాతాదారులు సహకరించాలని కోరారు.

విద్యుత్ చౌర్యానికి చెక్ పెట్టండి



మాట్లాడుతున్న ఎస్‌ఈ ఇస్మాయిల్ అహ్మద్

–సమీక్షలో ట్రాన్స్‌కో ఎస్‌ఈ ఇస్మాయిల్ అహ్మద్

చిత్తూరు కార్పొరేషన్: విద్యుత్ చౌర్యం జరగకుండా చూడాలని, ఎక్కడైనా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్నట్టు దృష్టికి వస్తే ఉపేక్షించరాదని ట్రాన్స్‌కో ఎస్‌ఈ ఇస్మాయిల్ అహ్మద్ ఆదేశించారు. శుక్రవారం ట్రాన్స్‌కో చిత్తూరు అర్బన్ డివిజన్ కార్యాలయంలో ఆయన అధికారులతో సమీక్షించారు. పలు ప్రాంతాల్లో ఎస్సీ, ఎస్టీ సర్వీసుదారులు ఉచిత విద్యుత్ యూనిట్ల కంటే అధికంగా వినియోగించారన్నారు. వాటికి బిల్లులు కట్టడం లేదని, వారి నుంచి వసూలు విధిగా చేయాలన్నారు. ప్రతి నెలా విద్యుత్ బిల్లుల వసూళ్లపై దృష్టి పెట్టాలన్నారు. చిన్న మొత్తాలపై కాకుండా రూ.వేలు, లక్షల్లో పెండింగ్‌లో ఉండే సర్వీసుల నుంచి వసూళ్లు చేయాలన్నారు. పీఎం సూర్య ఘర్ పథకం ఆశించిన స్థాయిలో క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదన్నారు. ఈ పథకంపై కేంద్ర ప్రభుత్వం కల్పిస్తున్న సబ్సిడీ, ఉపయోగాల గురించి చిత్తూరు నగరం, మండల కేంద్రాల్లో ఎక్కువ ప్రచారం చేయాలన్నారు. ఏఈ కార్యాలయాలకు పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పర్యటించాలన్నారు. సమీక్షలో ఈఈ మునిచంద్ర, డీఈలు ప్రసాద్, ఆనంద్ పాల్గొన్నారు.

బీసీలను మోసం చేస్తే సహించం

- ఎన్నికల హామీలను నెరవేర్చని కూటమి ప్రభుత్వం
- కలెక్టరేట్ వద్ద బీసీ సంక్షేమ సంఘం నిరసన



డీఆర్‌ఓకు వినతిపత్రం ఇస్తున్న బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర జేఏసీ చైర్మన్ జ్ఞాన జగదీష్

చిత్తూరు కలెక్టరేట్: బీసీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మోసం చేస్తే సహించేది లేదని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర జేఏసీ చైర్మన్ జ్ఞాన జగదీష్ మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలుగా దాటినా ఎన్నికల సమయంలో బీసీలకు ఇచ్చిన హామీలను ఇప్పటికీ నెరవేర్చకుండా దగా చేస్తోందని విమర్శించారు. హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ, బీసీలకు కూడా ఎస్సీ, ఎస్టీలకు ఉన్నట్టు ప్రత్యేక రక్షణ చట్టం తీసుకొస్తామని, చట్టసభల్లో 33 శాతం, స్థానిక సంస్థలు, నామినేటెడ్ పదవులు, నామినేషన్ వర్క్‌లలో 34 శాతం రిజర్వేషన్ అమలు చేస్తామన్న హామీలు ఇచ్చారన్నారు. అంతేకాకుండా ఇంత వరకు రాష్ట్రంలో కులగణనను సమగ్రంగా నిర్వహించకపోవడం దారుణమన్నా రు. స్థానిక ప్రాదేశిక నియోజక వర్గాల విభజన పూర్తి చేయకుండా, బీసీలకు స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్లు ఎలా కల్పిస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రాజ్యాంగ, న్యాయపరమైన ఇబ్బందులన్నీ అధిగమించి రిజర్వేషన్లు అమలు చేసిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలన్నారు. దామాషా ప్రకారం బీసీ సబ్‌ప్లాన్ ఏర్పాటు చేసి బడ్జెట్ నిధులు కేటాయించాలన్నారు. ప్రత్యేక నోడ ల్ ఏజెన్సీలతో నిధులు సక్రమంగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం తమ డిమాండ్లపై డీఆర్‌ఓ మోహన్‌కుమార్‌కు వినతిపత్రం ఇచ్చారు. బీసీ నాయకులు చంద్ర, సెల్వరాజ్, పవన్ కళ్యాణ్, దిలీప్, కార్తీక్, మదన్ కుమార్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

జేబులు నింపుకోవడానికే మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ

- సీఎం సామాజిక వర్గానికి మేలు చేసేందుకే పీపీపీ విధానం
- బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్ విమర్శ
బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్ విమర్శ



సమావేశంలో మాట్లాడుతున్న బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్

చిత్తూరు కలెక్టరేట్ : లంచాల కోసమే కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీల ప్రైవేటీకరిస్తోందని బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్ ధ్వజమెత్తారు. శుక్రవారం చిత్తూరులో ఆ పార్టీ నాయకులు సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, సీఎం తన సామాజిక వర్గం అభివృద్ధి, జేబులు నింపుకోవడానికే రాష్ట్రంలో మెడికల్ కాలేజీలను ప్రైవేటు బాట పట్టిస్తున్నారని, అందుకే పబ్లిక్, ప్రైవేట్, పార్టనర్‌షిప్ (పీపీపీ) విధానం తెచ్చారని విమర్శించారు. కూటమి సర్కారు ఎత్తుగడలను గమనిస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసేలా కుట్రలు చేస్తోందని, దీనివల్ల పలు సామాజిక వర్గాల విద్యార్థులు రాజ్యాంగబద్ధంగా పొందాల్సిన రిజర్వేషన్లు కోల్పోవాల్సిన దుస్థితి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు సురేంద్రబాబు మాట్లాడుతూ, ప్రజా సంక్షేమం, విద్యార్థుల భవిష్యత్తే ముఖ్యమని గద్దెనెక్కిన చంద్రబాబు ప్రస్తుతం వాటిని తుంగలో తొక్కేశారని, ముఖ్య నాయకులు, తమకు అనుకూలంగా ఉండే బినామీలకు మెడికల్ కాలేజీలు కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. తాజాగా 10 ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేసి లీజుకు ఇవ్వాలని కసరత్తు చేయడం దారుణమన్నారు. రాజ్యాంగంలోని ఏ నిబంధన మేరకు? ఎలాంటి అధికారాలతో ప్రజల ఆస్తులను 63 సంవత్సరాల పాటు లీజుకు ఇస్తారో కూటమి సర్కారు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. జిల్లా వాసి అయిన సీఎం చంద్రబాబు తన సొంత జిల్లాలో కొత్త మెడికల్ కళాశాల ఏర్పాటు, ఉన్న మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై తన స్పష్టమైన వైఖరి వెల్లడించాలన్నారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ఉపసంహరించుకోకపోతే ఆందోళనలకు పూనుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

15 నుంచి మండల స్థాయి క్రీడా పోటీలు

తవణంపల్లె: ఈ నెల 15వ తేదీ సోమవారం నుంచి మండల స్థాయి క్రీడాపోటీలు నిర్వహిస్తామని ఎంఈఓలు హేమలత, మోహన్‌రెడ్డి తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్, తవణంపల్లె మండల విద్యాశాఖ సంయుక్తంగా స్థానిక హైస్కూల్లో అండర్–14, 17 బాల బాలికలకు క్రీడాపోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన క్రీడాకారులను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. పోటీలకు మండలంలోని ఎయిడెడ్, ప్రభుత్వ, ప్రైవేటు, ఇతర పాఠశాలల క్రీడాకారులు పాల్గొనవచ్చన్నారు. అథ్లెటిక్స్, ఖో–ఖో, కబడ్డీ, వాలీబాల్, యోగా, చెస్, బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహిస్తామన్నారు. 6వ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ చదువుతున్న వారు అర్హులని మండల కో–ఆర్డినేటర్, పీడీ లలిత, హెచ్‌ఎం వేణుగోపాల్ రెడ్డి తెలిపారు.

బాల్య వివాహాలు వద్దు



బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ – సీడీపీఓ వినుతశ్రీ

బంగారుపాళెం: బాల్యంలో వివాహాలు చేసుకుని అవస్థలు పడకుండా చదువుకుని మంచి ప్రయోజకులుగా ఎదగాలని సీడీపీఓ వినుతశ్రీ అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ అధికారులు సంకల్ప కార్యక్రమాన్ని నిర్వహించారు. బాల్య వివాహాలు వల్ల కలిగే అనర్థాలు, గుడ్ టచ్–బ్యాడ్ టచ్, పోక్సో చట్టంపై అవగాహన, సెల్‌ఫోన్ అతిగా వాడటం వల్ల కలిగే దుష్ప్రభావం, మత్తు మందులకు బానిసలైతే కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. సీడీపీఓ మాట్లాడుతూ, పెళ్లీడు రాకనే బాలికల చదువుకు స్వస్తి పలికి వివాహాలు చేయడం నేరమన్నారు. బాల్య వివాహాల జరగకుండా ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడినా, అసభ్యంగా ప్రవర్తించినా కఠిన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం జనార్ధన్‌రెడ్డి, ఓఎస్‌సీ అడ్మిన్ చెందురాణి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, టీచర్లు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యం

పలమనేరు: రానున్న పంచాయతీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ బలపరచిన అభ్యర్థులను గెలిపించుకోవడమే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బాలాజీనాయుడు పిలుపునిచ్చారు. ఆయన శుక్రవారం బయ్యప్పగారిపల్లె పంచాయతీలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ, ఈ దఫా ఎన్నికలు ముందుగానే వస్తున్నాయని తెలిపారు. ఇప్పటి నుంచే నాయకులు, కార్యకర్తలు ప్రతి ఇంటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను వివరించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ పంచాయతీ ప్రెసిడెంట్ కే.గోవిందస్వామి నాయుడు, యూత్ ప్రెసిడెంట్ ఆనంద, రైతు నాయకులు దేవరాజులు, మహిళా నాయకురాలు కోటేశ్వరి, చెంగారెడ్డి, స్థానిక సర్పంచ్ ఎర్రయ్య బుజ్జి, ఎంపీటీసీ రమేష్, మాజీ సర్పంచులు అయ్యాకన్ను, హరికృష్ణ పాల్గొన్నారు.

యూరియా కోసం తప్పని తిప్పలు

కుప్పం: కుప్పం నియోజకవర్గంలో రైతులకు యూరియా తిప్పలు తప్పడం లేదు. నిత్యం రైతులు రైతు సేవా కేంద్రాలు, ఎరువుల దుకాణాలు చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ ఉన్నారు. రామకుప్పం మండలం గోవిందపల్లెలో శుక్రవారం యూరియా కోసం రైతులు అవస్థలు పడ్డారు. గంటల తరబడి క్యూలో నిలబడి ఒక బస్తా యూరియా కొనుగోలు చేయాల్సి వస్తోందని రైతులు వాపోయారు.



సాంస్కృతికం.. భక్తి పారవశ్యం







కాణిపాక వరసిద్ధి వినాయకస్వామి క్షేత్రంలో నిర్వహిస్తున్న ప్రత్యేక బ్రహ్మోత్సవాల్లో శుక్రవారం ఆస్థాన మండపంలో ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులకు అలరించాయి. కళాకారులు కూచిపూడి, భరత నాట్యంతో ఆకట్టుకున్నారు. అలాగే భక్తి పాటలు పాడారు. అనంతరం కళాకారులను శాలువలు, జ్ఞాపికలతో ఈఓ పెంచలకిషోర్ సత్కరించారు. -కాణిపాకం

